# ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలి

## కలెక్టర్ ప్రియాంక అల

భద్రాచలం, నవంబర్ 29 : ఎన్నికల విధులను ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి ఎస్.గణేశ్, కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. బుధవారం వారు భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఉంటారని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు పీవో డైరీ, ఫారం 17ఏ, 17సీ పరిశీలించి నమోదు చేయాలని చెప్పారు. పీవోల వద్ద పోలింగ్‌స్టేషన్‌కు సంబంధించిన ఓటర్ల జాబితా, ఏఎస్‌డీ లిస్ట్ ఉండాలన్నారు. ఉదయం 5:30 గంటలకే మాక్ పోల్‌ను పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో నిర్వహించాన్నారు. 50 ఓట్ల వరకు మాక్‌పోల్‌ను నిర్వహించి, వాటిని సీఆర్‌సీ ద్వారా క్లియర్ చేయాలన్నారు. వాటికి సంబంధించిన వీవీ ప్యాట్ స్లిప్‌లను భద్రపరచాలన్నారు. అనంతరం భద్రాచలం నియోజకవర్గంలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల్లోని పోలింగ్ కేంద్రాలకు పంపనున్న ఈవీఎం కిట్లను పరిశీలించారు. ప్రిసైడింగ్ అధికారులకు వాటిని పంపిణీ చేశారు. భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్, రిటర్నింగ్ అధికారి మాలోత్ మంగీలాల్, పట్టణ సీఐ నాగరాజ్‌రెడ్డి, ఎస్సైలు మధుప్రసాద్, పీవీఎన్ రావు, తహసీల్దార్లు, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల సామగ్రితో వెళ్తున్న వాహనాలను పరిశీలిస్తున్న కలెక్టర్, రిటర్నింగ్ అధికారి





ఈవీఎం, వీవీ ప్యాట్లను తీసువెళ్తున్న ప్రిసైడింగ్ అధికారులు

# పోలింగ్ ఏర్పాట్ల పరిశీలన



కాశీనగరంలో బూత్ ఏర్పాట్లు పరిశీలించిన ఎంపీడీవో ముత్యాలరావు

పర్ణశాల, నవంబర్ 29 : మండలంలో ఉన్న 40 బూత్ పోలింగ్ కేంద్రాలను దుమ్ముగూడెం ఎంపీడీవో ముత్యాలరావు బుధవారం పరిశీలించారు. మండలంలో ఉన్న 40 ఎన్నికల బూత్ పోలింగ్ కేంద్రాలను ఆరు సెక్టార్లుగా విభజించి ఆరుగురు సెక్టోరియల్ అధికారులను నియమించారు. బుధవారం సాయంత్రానికి అన్ని ఎన్నికల బూత్ పోలింగ్ అధికారులకు ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది చేరారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి కావాల్సిన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటుహక్కు వినియోగించుకునే ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి గుర్తింపు కార్డు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం సీఐ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

# కేటీపీఎస్ క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను సన్మానిస్తున్న సీఈ ప్రభాకర్‌రావు

పాల్వంచ, నవంబర్ 29 : శ్రీశైలం భారజల కర్మాగారంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగిన టీఎస్ జెన్కో స్టేట్ ఇంటర్ ప్రాజెక్ట్స్ ఉమెన్స్ గేమ్స్ (టెన్నికాయిట్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, షటిల్), కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి వివిధ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొందారు. వీరిని కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ప్రభాకర్‌రావు తన కార్యాలయంలో సన్మానించి అభినందించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన మహిళా క్రీడాకారులు ఏడీఈ నాగకల్యాణి, ఏఏవో శ్రీవల్లి, పార్వతి, చిన్నారి, శ్రీలక్ష్మి, మహాలక్ష్మిని ఘనంగా సన్మానించి అభినందించారు. కళాకారులు సర్వశ్రీ వీరమోహన్, అరుణ్ కృష్ణ, రమేశ్, నాగేశ్వరరావును అభినందించి సన్మానించారు. స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ 5, 6 దశల ఎస్‌లు వెంకటేశ్వర్లు, ఎస్‌ఏవో జార్జి, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ వీరస్వామి, రాజు, ధర్మరాజు పాల్గొన్నారు.

# చర్లలో ఉంజుపల్లి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ

కొత్తగూడెం క్రైం, నవంబర్ 29 : రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మకమైన ఉంజుపల్లి పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న బుధవారం సందర్శించారు. జిల్లాలోని చర్ల మండల పరిధిలో గల మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఉంజుపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంత పోలింగ్ కేంద్రంగా గుర్తించిన ఉంజుపల్లిలో 2004వ సంవత్సరం తరువాత ఈసారి మళ్లీ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. పూసగుప్ప, వద్దిపేట, ఉంజుపల్లి గ్రామాల్లో నివసించే ప్రజలు నిర్భయంగా తమ ఓటుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ సామగ్రితోపాటు ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పూసగుప్ప వద్ద మావోయిస్టులు లారీని తగులబెట్టిన ప్రదేశాన్ని ఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట అదనపు ఎస్పీ(ఆపరేషన్స్) టి. సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, చర్ల సీఐ బూర రాజగోపాల్ ఎస్పీ వెంట ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ వినీత్

# నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం



రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, నవంబర్ 21 : భద్రాచలం సీతా రామచంద్రస్వామి దేవస్థానంలో బుధవారం సీతా రాముల నిత్య కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి ముందుగా విశ్వక్సేన ఆరాధన, కర్మణ పుణ్యాహవాచన, కంకణధారణ, మాంగళ్యధారణ, తలంబ్రాల వేడుక, మంగళాష్టకం తదితర కార్యక్రమాలతో కల్యాణాన్ని జరిపారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

# ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలం, నవంబర్ 29 : ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీ ప్యాట్ల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం భద్రాచలం నియోజకవర్గవ్యాప్తంగా జరుగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఓటుహక్కు ఉన్న ప్రతిఒక్కరూ నిర్భయంగా వచ్చి వినియోగించుకోవాలన్నారు. ఓటుహక్కును రాజ్యాంగం కల్పించిందని ఓటు ద్వారా ప్రజాస్వామ్యం కాపాడబడుతుందని తెలిపారు. ప్రలోభాలకు లొంగకుండా సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. భద్రాచలంలో పోలింగ్ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంటుందని, మీ ఓటుహక్కును నిర్భయంగా, నిరభ్యంతరంగా వినియోగించుకోవచ్చని తెలిపారు.



మాట్లాడుతున్న భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్

# నేటి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

దుమ్ముగూడెం, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి దుమ్ముగూడెం మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. మొత్తం 40 పోలింగ్ కేంద్రాల్లో నలుగురు చొప్పున 200 మంది సిబ్బందిని ఎన్నికల విధులకు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రంలో ఇప్పటికే ఎన్నికల సామగ్రితో సిబ్బంది విధులకు హాజరైనట్లు తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉండడంతో 100 మీటర్ల వరకే రాజకీయ పార్టీలకు అనుమతి ఉంటుందని పోలింగ్ కేంద్రంలోకి అనుమతిలేదని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో 300 మంది సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవచ్చని, మండలవ్యాప్తంగా 34,658 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు.